క్లుప్తంగా

కొనసాగుతున్న పూడికతీత పనులు



పెనమలూరు: కానూరులో డ్రెయిన్ల పూడికతీత పనులను తాడిగడప మున్సిపాలిటీ చేపట్టింది. ప్రధానంగా పంట కాలువ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవటంతో వర్షం పడితే తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. స్థానికుల అభ్యర్థనతో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు వెంటనే స్పందించి చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కానూరులో పారిశుద్ధ్యం మెరుగుపర్చడానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డ్రెయినేజీలు పూడుకుపోవటంతో మురుగునీరు పారుదల జరగటం లేదన్నారు. జేసీబీతో గ్రామంలో ప్రధాన డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రారంభించామన్నారు. డ్రెయినేజీల సమస్యతో పాటు పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

గన్నవరం: గన్నవరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అకారణంగా తొలగించిన నలుగురు కాంట్రాక్ట్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ నిడమర్తి సౌజన్య అధ్యక్షతన జరిగిన పాలకవర్గ సమావేశంలో వాడీవేడిగా చర్చ జరిగింది. దీర్ఘకాలంగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్న సిబ్బందిని పాలకవర్గం ఆమోదం లేకుండా ఎందుకు తొలగించారని వార్డు సభ్యులు ప్రశ్నించారు. తిరిగి వారిని విధుల్లోకి తీసుకోవాలని గట్టిగా పట్టుబట్టారు. మర్లపాలెంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఓ ప్రైవేట్ సంస్థ ఫైబర్‌నెట్ వైర్ల కోసం పంచాయతీ రోడ్లు ధ్వంసం చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై విచారణ జరిపి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సభను వాయిదా వేశారు. ఉప సర్పంచ్ పాలడుగు నాని, పలువురు ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


కొనసాగుతున్న కులగణన సర్వే

విజయవాడరూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన కులగణన సర్వేను ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కొనసాగిస్తోంది. గతంలో సచివాలయ గ్రేడ్ - 5 కార్యదర్శులు, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కులగణన సర్వే నిర్వహించారు. ఆధార్ కార్డులోని వివరాల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రం పొందడానికి వీలుగా కులగణన సర్వేను చేశారు. ఎన్నికలకు ముందుగా నిర్వహించిన ఈ సర్వే ఇంకా పూర్తికాక పోవడంతో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం కూడా యుద్ధప్రాతిపదికన కులగణన సర్వేను పూర్తి చేయాలని రెవెన్యూ శాఖను ఆదేశించింది. గ్రామాల్లోని వీఆర్వోలు కులగణన సర్వేను కొనసాగిస్తున్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా సర్వే జరుగుతుంది. విజయవాడ రూరల్ మండలంలో 13,213 మందికి సంబంధించి కులగణన సర్వే చేయాల్సి ఉండగా వాటిలో 3,370 పూర్తి చేశామని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. సర్వే కొనసాగుతుందన్నారు. పర్మినెంట్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడానికి వీలుగా ఈ సర్వే జరుగుతుందన్నారు. ఆధార్ నంబర్ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా కుల సర్టిఫికెట్‌ను తీసుకోవచ్చని చెప్పారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం ఆరుగొలనులోని జెడ్పీ హైస్కూల్‌లో వీ క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న 31 మంది చిన్నారులకు బుధవారం ఉచితంగా నోట్ బుక్స్ అందించారు. వీ క్యూబ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.వీర రాఘవరావు చేతుల మీదుగా పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు టి.దుర్గాప్రసాద్, వీ క్యూబ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప మందిరంలో పారాయణం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దుర్గాపురం శ్రీ అయ్యప్పస్వామి మందిరంలో బుధవారం సాయంత్రం శ్రీ మణికంఠ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన అయ్యప్ప భజన, పారాయణం జరిగింది. ట్రస్ట్ అధ్యక్షుడు బల్లెం పూర్ణయ్య స్వామి స్వామివారికి విశేషంగా పంచామృత అభిషేకం, అర్చనలు పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అందుబాటులో ఆరోగ్య కేంద్రం

- యనమలకుదురులో రూ.4 కోట్లతో భవనం నిర్మాణం
- మండలంలో విస్తరించనున్న వైద్య సేవలు
- 6న ప్రారంభానికి సన్నాహాలు



యనమలకుదురులో నూతనంగా నిర్మించిన ఆరోగ్య కేంద్ర భవనం

పెనమలూరు: మండల పరిధి యనమలకుదురు గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు నూతన భవన నిర్మాణం పూర్తి చేశారు. దాత ముందుకు వచ్చి రూ.4 కోట్లతో అన్ని హంగులతో భవన నిర్మాణం చేసి ల్యాబ్‌కు పరికరాలు కూడా సమకూర్చారు. ఈ ఆరోగ్య కేంద్రాన్ని ఈ నెల 6వ తేదీన ప్రారంభించటానికి రంగం సిద్ధం చేస్తున్నారు.

ఫీల్డ్ స్టాఫ్‌తోనే సేవలు..

పెనమలూరు మండల జనాభా గతంలో 75 వేల మంది ఉన్న సమయంలో గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశారు. విజయవాడ నగరానికి పక్కనే పెనమలూరు ఉండటంతో గత రెండు దశాబ్దకాలంలో మండల జనాభా దాదాపు 4 లక్షలకు చేరుకున్నారు. అయితే ప్రజల అవసరాల మేరకు ఆరోగ్య కేంద్రాల సంఖ్య పెంచలేదు. దీంతో గ్రామాల్లో, కాలువ కట్టలపై నివశించే పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందటం లేదు. ఫీల్డ్ స్టాఫ్‌తోనే సేవలు అందిస్తున్నారు.

యనమలకుదురుతో తీరనున్న సమస్యలు

యనమలకుదురు గ్రామంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయటంతో సమస్యలు తీరనున్నాయి. ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయటానికి వెలగపూడి ట్రస్ట్ ఆధ్వర్యంలో వెలగపూడి రాజ్‌కుమార్ తన తల్లిదండ్రులు వెలగపూడి ఉమామహేశ్వరరావు, విజయలక్ష్మిల పేరిట ఆస్పత్రి భవనం నిర్మాణానికి రూ.4 కోట్లు నిధులు సమకూర్చారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దాదాపు 35 సెంట్ల స్థలం కేటాయించింది. ఏడాదిన్నరలో అన్ని హంగులతో నూతన భవన నిర్మాణం పూర్తిచేశారు. అత్యధికంగా పేదలు, మధ్య తరగతి ప్రజలు ఈ ప్రాంతంలో నివశిస్తున్నందున నూతన ఆరోగ్య కేంద్రం ఏర్పాటు పేదలకు వరంగా మారనుంది. ఇక మెరుగైన వైద్య సేవలు ప్రజలకు చేరువ కానున్నాయి. ఈ నూతన భవనంలో అత్యాధునిక వైద్య పరికరాలు కూడా సమకూర్చారు. ఈ నెల 6వ తేదీన ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌తో దీనిని ప్రారంభించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. యనమలకుదురు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి 24 గంటలు సేవలు అందిస్తే ఈ ప్రాంతంలో ఎందరో పేదలకు మేలు కలుగుతుంది. మండల పరిధిలో వైద్య సేవలు పూర్తి స్థాయిలో విస్తరించవచ్చు. ఆరోగ్య కేంద్రం పరిపాలన కూడా సులభతరంగా మారుతుంది.

భారంగా మారిన పెనమలూరు పీహెచ్‌సీ

మండలానికి ఉన్న పెనమలూరు ఆరోగ్య కేంద్రం సేవలు భారంగా మారాయి. మండల జనాభాకు తగ్గట్టుగా తగినన్నీ ఆరోగ్య కేంద్రాలు లేకపోవడంతో పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిపాలన సమస్యగా మారింది. పెనమలూరు పీహెచ్‌సీ పరిధిలో 30 గ్రామ సచివాలయాలు, 25 ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాన్ని విభజించాల్సిన ఆవశ్యకత ప్రస్తుత పరిస్థితిలో ఏర్పడింది. అన్ని పెనమలూరు పీహెచ్‌సీ కిందే పని చేయటంతో క్షేత్రస్థాయిలో వైద్య సేవలపై పరిశీలన తగ్గిందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కాగా పోరంకిలో రెండేళ్ల క్రితం మరో ఆరోగ్య కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసింది. సిబ్బందిని నియమించి ప్రభుత్వం జీతాలు చెల్లిస్తున్నా నేటి వరకు దానిని ప్రారంభించలేదు. నూతన ఆరోగ్య కేంద్రానికి నిధులు రూ.2.40 కోట్లు మంజూరు చేసినా నేటికి భవనం నిర్మాణం జరగలేదు. దీంతో పోరంకిలో ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సేవలు నామమాత్రంగానే అందుతున్నాయి.

అందరి సహకారంతో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు



గ్రామంలో ఆరోగ్య కేంద్రం అవసరం ఎంతైనా ఉంది. దాత రాజ్ కుమార్, ప్రభుత్వ అధికారుల సహకారంతో ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం పూర్తి చేశాం. ఈ నెల 6వ తేదీన దీనిని ప్రారంభిస్తాము. 24 గంటలు వైద్యం అందించాలన్నదే మా లక్ష్యం.

– సంగా నరసింహారావు, యనమలకుదురు

మహానందీశ్వరునికి అభిషేకం



విశేష అలంకరణలో మహానందీశ్వరుడు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ మహానందీశ్వరునికి త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో అభిషేకం చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి ప్రత్యేక పూజలు

యనమలకుదురు దేవస్థానంలో 4, 5 తేదీల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 4వ తేదీ గురువారం మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 6.30, 8.00, 9.30, 10.30 గంటలకు స్వామివారికి అభిషేకం చేస్తారు. ఉదయం 10 గంటలకు స్వామివారికి శాంతికల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఇక 5వ తేదీన స్వామివారి జన్మనక్షత్రం సందర్భంగా ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ, 7 గంటలకు పంచహారతులు ఇస్తారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో వచ్చి పూజల్లో పాల్గొనాలని ఈఓ గంగాధరరావు కోరారు.



ప్రొద్దుటూరు వంతెన కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క

కాలువల్లో తూడు.. అన్నదాతల బేజారు

ప్రధాన కాలువలు, పంట బోదెలు, మురుగు బోదెలు తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయి ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ఆరంభం కావటంతో రైతులు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో కాలువలు, బోదెల్లో తూడు, గుర్రపుడెక్క పేరుకుపోయి ఉండటంతో అన్నదాతలు సాగునీటి విషయంలో ఆందోళన చెందుతున్నారు. కాలువ చివరి భూములకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని వాపోతున్నారు. పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని బందరు, పుల్లేరు, రైవస్ కాలువలు, వీటికి అనుబంధంగా ఉన్న పంట కాలువలు, బోదెల్లో నెలకొన్న తూడు, గుర్రపుడెక్కను తొలగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

– కంకిపాడు



కంకిపాడు లాకులు వద్ద బందరు కాలువలో..



గోసాలలో పేరుకుపోయిన తూడు

గన్నవరం హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా సురేష్

గన్నవరం రూరల్: మండల హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈగా, ఉంగుటూరు మండల హౌసింగ్ ఏఈ మండవ సురేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ గన్నవరం ఏఈగా పని చేసిన ఎస్.సత్యనారాయణ(సాయి) ఉద్యోగ విరమణ చేయటంతో ఇన్‌చార్జి ఏఈగా సురేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సురేష్‌ను ఉద్యోగులు అభినందించారు.

వరుస బైక్ చోరీలతో బెంబేలు

పెనమలూరు: మండల పరిధిలో వరుస బైక్ చోరీలతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు బైక్‌లు చోరీ జరిగిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి శ్రీనివాసానగర్‌కు చెందిన తోట సాయిగోపీరామ్ కానూరు 100 అడుగుల రోడ్డులో కామినేని ఆస్పత్రికి వెళ్లి ఆస్పత్రి బయట బైక్ పార్కు చేశాడు. అతను పని చూసుకోని తిరిగి బయటకు వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు బైక్ చోరీ చేశారు. అదే విధంగా పోరంకికి చెందిన చవాన్‌మహేందర్ కానూరులో అపార్టుమెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను తన బైక్ వేసుకోని గంగూరు స్పిన్నింగ్ మిల్స్ వద్దకు వెళ్లి బైక్ బయట పార్కు చేశాడు. పని చూసుకోని బయటకు వచ్చి చూడగా, బైక్ కనబడలేదు. బైక్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ ఘటనలపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసులు నమోదు చేశారు.

6న సంగీత విద్వాంసుడు బాలమురళికి సప్త స్వరాంజలి

విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ శనివారం శివరామకృష్ణ క్షేత్రంలోని శ్రవణ సదనంలో సంగీత విద్వాంసుడు మంగళంపల్లి బాలమురళీ కృష్ణ 94 వ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు స్వరఝరి ప్రధాన కార్యదర్శి మోదుమూడి సుధాకర్ బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఐదు గంటలపాటు బాలమురళీ కృష్ణ స్వరపరచిన సంకీర్తనలతో సప్త స్వరాభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాలమురళీ కృష్ణ సన్నిహితుడు అన్నవరపు రామస్వామి, రామకోటి క్షేత్రం ధర్మాధికారి శిష్ట్లా హనుమత్ ప్రసాద్, బాలమురళీ కృష్ణ శిష్యుడు డీవీ మోహన కృష్ణతో పాటు సంగీత విద్వాంసులు పాల్గొంటారని తెలిపారు.

ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టండి



ప్లాస్టిక్ అనర్థాలను వివరిస్తూ స్కిట్ చేస్తున్న విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పర్యావరణానికి ప్రమాదంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని సత్యనారాయణపురం ఏకేటీపీ మున్సిపల్ స్కూల్ ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు సత్యవేణి అన్నారు. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలపై విద్యార్థి దశ నుండే అవగాహన పెంచుకోవాలని సూచించారు.అంతర్జాతీయ ప్లాస్టిక్ నివారణా దినం పురస్కరించుకుని ప్రజా ప్రగతి ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియన్ పొల్యూషన్ కంట్రోల్ అసోసియేషన్, కియా మోటార్స్ వారి సహకారంతో బుధవారం స్థానిక ఏకేటీపీ మున్సిపల్ స్కూల్‌లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలను వివరిస్తూ విద్యార్థులు స్కిట్ చేశారు. ప్లాస్టిక్, సీసాలు, కవర్లు ధరించి వినూత్నంగా ప్రదర్శన చేపట్టారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పాటలు పాడారు. అధ్యాపకులు శ్రీనివాస్, ప్రజా ప్రగతి ట్రస్ట్ ప్రతినిధి ఎం.నాగేశ్వరరావు, వెంకటేష్, బాలాజీ, జగదీష్, చందు, గౌరీ పాల్గొన్నారు.

13న ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై వర్క్‌షాప్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 13వ తేదీ శనివారం ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన స్కీమ్‌పై ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ దాసరి దేవరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్క్‌షాప్ చాంబర్ డెవలప్‌మెంట్ అధికారి ప్రభ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. వర్క్‌షాప్‌లో కుటీర పరిశ్రమలు, వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చెప్పులు కుట్టే వారు, తాపీ పని చేసే వారు, బుట్ట/చాప/చీపుర్లు నేసేవారు, బొమ్మల తయారీ దారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీ దారులకు రూ.1 లక్ష నుంచి 3 లక్షల వరకు రుణ సౌకర్యం బ్యాంకుల నుంచి మద్దతు, డాక్యుమెంటేషన్, మార్కెటింగ్ మద్దతు అందిస్తామన్నారు. ఆసక్తి కలిగిన విశ్వకర్మ యోజన వ్యాపారులు వర్క్ షాప్‌లో పాల్గొనటానికి నోరీ హాస్పిటల్ సమీపంలోని ఎంఎస్‌ఎంఈ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యాలయంలో స్వయంగా కానీ, 89197 37517, 63059 41717 ఫోన్ నంబర్‌లలో కాని తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సమాజాభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలకపాత్ర



బాధ్యతలు స్వీకరిస్తున్న రోటరీక్లబ్ నూతన కార్యవర్గం

గన్నవరం: రోటరీ క్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించింది. స్థానిక కొత్తపేటలోని రోటరీ ఆడిటోరియంలో క్లబ్ నూతన అధ్యక్షుడిగా టీఎస్‌ఆర్‌కె.ప్రసాద్, కార్యదర్శిగా జీవీ రవిబాబు, మిగిలిన కార్యవర్గంతో రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంవీ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పోలియో నిర్మూలనతో పాటు విద్య, వైద్య రంగాల్లో తమవంతు సేవలందిస్తున్నట్లు చెప్పారు. రోటరీ సేవలను మరింత విస్తృతం చేసేందుకు యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి సభ్యులుగా చేరాలని కోరారు. 2023-24లో గన్నవరం శాఖ అత్యుత్తమ సేవలు అందించిందన్నారు. ఇదే స్ఫూర్తితో నూతన కార్యవర్గం కూడా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ గవర్నర్ జి.శ్రీహర్ష, తాజా మాజీ అధ్యక్ష, కార్యదర్శులు జాస్తి విజయభూషణ్‌కుమార్, నర్రా సీతారామారావు, ప్రస్తుత ఉపాధ్యక్షుడు జాస్తి ఫణిశేఖర్, సంయుక్త కార్యదర్శి టి.మురళీకృష్ణ, కోశాధికారి జి.త్రివేది తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి



విద్యార్థినులకు క్లాత్ బ్యాగ్‌లు అందజేస్తున్న వరప్రసాద్, శ్రీహరిబాబు

ఉంగుటూరు: భవిష్యత్ తరాలకు ప్లాస్టిక్ రహిత సమాజాన్ని అందించేందుకు ప్లాస్టిక్ వాడకానికి నో చెబుదామని ప్రిన్సిపాల్ జీవీకేఎస్వీ ప్రసాద్ విద్యార్థులకు సూచించారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణం ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిందని, ఫలితంగా పర్యావరణ సమతూల్యత దెబ్బ తింటుందని పేర్కొన్నారు. అనంతరం 2 వేల మంది విద్యార్థులకు క్లాత్ బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, ఐటీ హెచ్ఓడీ వరప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లి, కవలల మృతితో పోరంకిలో విషాదం



మాధవి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

పెనమలూరు: విజయవాడ పటమటలో వైద్యుల నిర్లక్ష్యంతో మృతి చెందిన ఇద్దరు కవల పిల్లలు, తల్లి బంద్రపల్లి మాధవి(23) మరణంతో పోరంకి, గంగూరు గ్రామాల్లో విషాదం చోటు చేసుకుంది. మాధవి గర్భిణి కావడంతో ఆమె బంధువులు డెలివరీకి పటమట పద్మావతి ఆస్పత్రికి మంగళవారం రాత్రి తీసుకువెళ్లారు. వైద్యుల నిర్లక్ష్యంతో తల్లి కడుపులో ఉన్న ఇద్దరు బిడ్డలు మృతి చెందారు. కాగా మాధవి స్వగ్రామం గంగూరు. గతంలో వలంటీర్‌గా పని చేసింది. గంగూరు సచివాలయం - 1లో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రశాంత్ గత మూడేళ్ల క్రితం మాధవిని వివాహం చేసుకున్నాడు. వీరికి ఏడాదిన్నర క్రితం మొదటి కాన్పులో బాబు పుట్టాడు. రెండో కాన్పులో ఈ ఘటన చోటుచేసుకుంది. మాధవి మృతదేహాన్ని పోరంకి బీజేఆర్‌నగర్‌కు తీసుకువచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

మహోన్నత నటుడు ఎస్వీ రంగారావు



మాట్లాడుతున్న దర్శకుడు రేలంగి నరసింహారావు, శ్రీనివాసులు, దేవిడ్‌రాజు తదితరులు

విజయవాడ కల్చరల్: మహోన్నత నటుడు ఎస్వీ రంగారావు అని సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు. సమైక్యభారతి సేవా సంస్థ, జేపీ రాజ్, స్వరాంజలి టాలెంట్ ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో బుధవారం సినీ నటుడు, దర్శకుడు, నిర్మాత ఎస్వీ రంగారావు 106వ జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రేలంగి నరసింహారావు మాట్లాడుతూ ఎస్వీఆర్ లేని తెలుగు సినిమా పరిశ్రమను ఊహించలేమన్నారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు మాట్లాడుతూ ఆయన ఏ పాత్రనైనా అవలీలగా పోషించగలడన్నారు. డైలాగ్ టైమింగ్ ఆయనకు మాత్రమే సాధ్యమని తెలిపారు. సమైక్య భారతి నిర్వాహకుడు పి.కన్నయ్య మాట్లాడుతూ కవులు, కళాకారులు భాషా వికాసానికి కృషి చేయాలని సూచించారు. నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య వరప్రసాద మూర్తి ఎస్వీఆర్ నట సేవలను వివరించారు. వివిధ సంస్థలకు చెందిన బీవీ వీరభద్రరావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. నగరానికి చెందిన గాయనీ గాయకులు కె.డేవిడ్‌రాజు, బీవీరావు, రామానుజాచార్యులు, జయప్రభ, జోషి, పి.శ్రీనివాసరావు, మల్లాది స్వాతి, కొమ్మినేని రత్నకుమారి, సుకన్య, హేమలతాదేవి, అమలారాణి తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. అనంతరం నిర్వాహకులు గాయనీ గాయకులను సత్కరించారు.

రోటరీ క్లబ్ ఈస్ట్‌కు 18 పురస్కారాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ గడిచిన ఏడాది కాలంలో నిర్వహించిన వివిధ సేవా కార్యక్రమాలకు సుమారు 18 పురస్కారాలను అందుకున్నట్లు క్లబ్ అధ్యక్షులు బాయన బాబూజీ (బాబ్జీ) తెలిపారు. ఇటీవల నగరంలో రోటరీ డిస్ట్రిక్ట్ 3020 అవార్డ్స్ 2023-24 కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగిందని పేర్కొన్నారు. ఆ క్రమంలో ఆ వేదికపై రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ విభాగానికి పలు అంశాలలో సేవా పురస్కారాలను అందుకున్నామని పేర్కొన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా తనకు రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఆర్వీ సుబ్బారావు (దత్తా) చేతుల మీదుగా డైమండ్ అవార్డును అందించారని పేర్కొన్నారు. అలాగే వివిధ విభాగాలకు సంబంధించి మొత్తం 18 పురస్కారాలను తమ కార్యవర్గం అందుకున్నట్లు తెలిపారు. సహచర రోటరీ సభ్యులందరి సహకారంతో తమ క్లబ్ తరఫున నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా, అవార్డులను అందుకోవటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. క్లబ్ సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఈ పురస్కారాలు స్ఫూర్తినిస్తాయని తెలిపారు. పురస్కారాలను అందుకున్న కార్యవర్గంలో క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నరన్ జీవీ రామారావు, డిస్ట్రిక్ట్ కార్యదర్శి మాలపాక భాస్కర్, అసిస్టెంట్ గవర్నర్ పిళ్లా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ధార్మిక ప్రవచన కార్యక్రమం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై డాక్టర్ మేడసాని మోహన్ ధార్మిక ప్రవచన కార్యక్రమం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. బుధవారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై అవధాన సామ్రాట్ డాక్టర్ మేడసాని మోహన్ పాండవులు అరణ్యవాసంలో అమ్మవారికి కొలిచిన విధానం, అమ్మవారి మహిమల గురించి వివరించారు. తొలుత మేడసాని మోహన్ దేవస్థానానికి విచ్చేయగా, ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.